క్లుప్తంగా

చిన్నారులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



స్టీల్‌ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ సభ్యులు

నిడదవోలు రూరల్: మండలంలోని రావిమెట్ల, శంకరాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో విప్పర్తి నాగేశ్వరరావు ఆర్థిక సాయంతో స్టీల్ ప్లేట్లు, గ్లాసులు శనివారం పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు ఇంజే శేఖర్, పెచ్చెట్టి ఫణిసింహ, గుబ్బల సత్య ప్రసాద్, డి.శివనాగరాజు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ

పెరవలి: మార్గశిర మాసంలోని శనివారం కావడంతో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలి రావడంతో స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామివారికి వందలాది మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దాతల ఆర్థిక సహాయంతో సుమారు ఆరు వేల మందికి భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు అన్నసమారాధన, ప్రసాదాల వితరణ చేస్తున్నామని తెలిపారు.

ప్రక్కిలంక స్టేట్ బ్యాంక్‌లో రైతు దినోత్సవం

తాళ్లపూడి: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కిలంక శాఖ వద్ద శనివారం రైతు దినోత్సవం పేరుతో రైతులు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి స్టేట్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఎస్.రమేష్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ బ్యాంకు రైతులకు, మహిళలకు అందిస్తున్న రుణ సదుపాయాల గురించి ఆయన వారికి మాట్లాడారు. కార్యక్రమంలో స్టేట్‌బ్యాంక్ చీఫ్ మేనేజర్ రమణకుమార్, ప్రక్కిలంక బ్రాంచ్ మేనేజర్ బి. వెంకటయ్య , మండల వ్యవసాయాధికారి రుచిత, ఫీల్డ్ ఆఫీసర్ అనిల్, క్యాష్ ఆఫీసర్ ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



రోగి రాజబాబుకు ఆర్థిక సాయం అందిస్తున్న లయన్ రంగా వెంకటేశ్వరరావు, లయన్స్ సభ్యులు

నిడదవోలు: పట్టణానికి చెందిన పసుపులేటి రాజాబాబు పాన్‌షాపులో కూలీగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అతడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలిసిన లయన్స్ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో దాత,లయన్ రంగా వెంకటేశ్వరరావు శనివారం పసుపులేటి రాజబాబుకు రూ.10 వేల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జేష్ట వెంకటేశ్వరరావు, కోశాధికారి బండి రాంగోపాల్, సభ్యులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన

చాగల్లు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఉద్దేశించి కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను మండల కాంగ్రెస్ తప్పుబట్టింది. ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మట్టా సుబ్బారావు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కొక్కురుపాటి లక్ష్మి ఆధ్వర్యంలో మీనానగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. కేంద్ర హోం అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. ఎవరైనా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తక్షణం అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పుల్లారావు, కొవ్వూరు పట్టణ శాఖ అధ్యక్షుడు డి. బుజ్జిబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలి



మహాసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి అరుణ్

నిడదవోలు: భారత రాజ్యాంగంతో పాటు ప్రజల సంపదను పరిరక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. సీపీఎం నిడదవోలు పట్టణ మహాసభను శనివారం పట్టణంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టి.అరుణ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లయిన సందర్భంగా పార్లమెంట్‌లో రాజ్యాంగంపై చర్చ జరుగుతోందన్నారు. 'అంబేద్కర్.. అంబేద్కర్ అంటూ రాజ్యాంగ నిర్మాత పేరు పార్లమెంట్ సభ్యులు పలకడం ఫ్యాషన్ అయిపోయింది.భగవంతుడిని ప్రార్థిస్తే పుణ్యం వస్తుంది' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను అరుణ్ తీవ్రంగా ఖండించారు.భారత రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు కమ్యూనిస్టులు సిద్ధంగా ఉండాలని కోరారు. సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో కేక్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



తాళ్లపూడిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు



గోపాలపురంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత



దూబచర్లలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత



నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు భోజన పొట్లాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగన్ బర్త్ డే.. అభిమానులకు పండగ

- నందడి చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- యర్నగూడెంలో మాజీ మంత్రి వనిత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం
- డివిజన్ వ్యాప్తంగా వృద్ధులకు దుప్పట్లు, రోగులకు పండ్లు పంపిణీ
- బాణసంచా కాల్చి నందడి చేసిన పార్టీ కార్యకర్తలు



యర్నగూడెంలో రక్తదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు. శిబిరాన్ని సందర్శించిన మాజీ మంత్రి తానేటి వనిత



చాగల్లు పీహెచ్ సీలో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఆ పార్టీ శ్రేణులు కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు దుప్పట్లు, వస్త్రాలు, ప్రభుత్వాసుపత్రుల్లోని రోగులకు పండ్లు, పాలు, రొట్టెల పంపిణీ చేశారు. రాష్ట్ర మాజీ మంత్రి, ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. యర్నగూడెంలోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని తానేటి వనిత ప్రారంభించారు. శిబిరంలో పలువురు నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. దేవరపల్లి బస్టాండ్ వద్ద గల దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వనిత పూలమాల వేసి నివాళులు అర్పించి, కేక్‌కట్ చేశారు. కృష్ణంపాలెం వద్ద గల అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, సురేష్ దంపతులు సమకూర్చిన దుప్పట్లను మాజీ మంత్రి తానేటి వనిత పంపిణీ చేశారు. గొల్లగూడెంలో పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో వనిత పాల్గొని కేక్‌కట్ చేశారు.కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాల అధ్యక్షులు కూచిపూడి సతీష్, గగ్గర శ్రీనివాస్, నాగరాజు, దేవరపల్లి, గోపాలపురం ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, బంక అప్పారావు, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, సర్పంచ్ బొంతా భరత్‌బాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకను శనివారం కొవ్వూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు సారథ్యంలో జగన్ పుట్టిన రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక వాత్సల్య వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఒక రోజు భోజన వసతి కల్పించారు.ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంచారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు పంచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే సంక్షేమ పథకాల రూపంలో కులం, మతం, పార్టీ చూడకుండా పేదలకు గరిష్టంగా రూ.4.75 లక్షల కోట్ల సాయం అందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తోందన్నారు. అనంతరం జగన్ బర్త్‌డే కేక్‌ను తలారి వెంకట్రావు కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జువరపు రామచంద్రరావు, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్ర కుమార్, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, సర్పంచులు ముప్పిడి మహాలక్ష్మ్మడు, మట్టా వెంకట్రావు, కుడప రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఎస్‌కె పాషా, పార్టీ నాయకులు ఉండవల్లి శ్రీనివాస్, జాలెం వెంకట్రావు, బొర్రా కృష్ణ, వర్ధినేడి చినబాబు, పొన్నాడ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు. ఊనగట్ల, దారవరం గ్రామాల్లో కూడా పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడి, గజ్జరం గ్రామాల్లో జగన్ బర్త్‌డే కేక్‌ను వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే ఆ పార్టీ పెద్దేవం, తాడిపూడి నాయకులు కేక్ కట్‌చేసి జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, జిల్లా గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి గూడా విజయరాజు, వైస్ ఎంపీపీ కోదాటి కనకయ్య, సర్పంచులు గండి రాంబాబు, తిగిరిపల్లి వెంకట్రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురం: గోపాలపురంలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కూసం రామమోహన్‌రెడ్డి ఇంటి వద్ద జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్య తిథిగా హాజరైన మాజీ మంత్రి తానేటి వనిత సుమారు 100 మంది పేదలకు మిఠాయిలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా కేక్ కట్ చేసి జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ముల్లంగి శ్యామ్‌సుందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పడమట సత్యనారాయణ, వింత ప్రసాద్‌రెడ్డి, నడవపల్లి సతీష్, జొజ్జవరపు అన్నవరం తదితరుల పాల్గొన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు నాయకులు కార్యకర్తలు ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు.

నల్లజర్ల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు దూబచర్లలో ఘనంగా నిర్వహించారు. ఇక్కడి వైఎస్సార్ విగ్రహం వద్ద మాజీ మంత్రి తానేటి వనిత కేక్ కట్ చేసి అందరికీ పంచారు. 100మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 300 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తొమ్మండ్రు రవి, పంది సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, కారుమంచి రమేష్, దోవసాయి, మండలపరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: వైఎస్సార్ సీపీ నిడదవోలు ప్రధాన కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, జన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన పార్టీ శ్రేణులు జగన్ చిత్ర పటంతో ఉన్న కేక్‌ను కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, పార్టీ పట్టణశాఖ కార్యదర్శి గాజుల రంగారావు, పార్టీ పెరవలి మండలశాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, యాళ్ల రామారావు, ఎస్‌కే వజీరుద్దీన్, పువ్వల రతీదేవి, కొత్తపల్లి సుప్రియ, సత్తి వేణుమాధవరెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్, ఎస్‌కే చాన్‌బాషా, బయ్యే కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక బసివిరెడ్డిపేటలో జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డునే గల దివంతగ మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద శనివారం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. మేడపాటి రామకృష్ణారెడ్డి, బండి రాజేష్, శ్రీనివాసు, మేడపాటి ప్రసాద్‌రెడ్డి, అరిగళ్ళ నాగేంద్ర, మద్దెల వెంకటేశ్వరరావు, నాగళ్ళ సీతారామయ్య పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం, విజ్జేశ్వరం, శెట్టిపేట, డి.ముప్పవరం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు కేక్‌లను కట్ చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ సర్పంచుల ప్రతినిధి తిక్కా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, ఎస్‌కే రహీం, దేశాబత్తుల నాగు, వడల అంబేడ్కర్, దాసరి రాజ్‌కుమార్, ములపర్తి రాంబాబు, కాపకాయల శ్రీను, గొల్లకోటి పోశియ్య, రత్నరాజు, సుధాకర్, శేఖర్, వైఎస్సార్‌సీపీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పెరవలి: జగన్ పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని కానూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు 'జై జగన్.. జైజై జగన్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ జగన్ అభిమానులు, పార్టీ శ్రేణులు ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్ను గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య ఆధ్వర్యంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణబ్రహ్మానందంతో పాటు పార్టీ గ్రామ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ముళ్ళపూడి కేశవరావు, బూరుగుపల్లి ఆనంద్, ముళ్ళపూడి కృష్ణారావు, బీసీ నాయకులు పాకలపాటి వీరవెంకట సత్యనారాయణ, కంజలూరి శ్రీను, షేక్ మస్తాన్, మల్లిపూడి సురేష్, చదలవాడ అరీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వడ్లూరులో సొసైటీ మాజీ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు ఆధ్వర్యంలో మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి కేక్ కట్ చేశారు.



నిడదవోలు మండలం విజ్జేశ్వరంలో ..



కానూరులో పార్టీ పెరవలి మండల శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో..



వేలివెన్నులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కూటమి అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు

- మాజీ మంత్రి తానేటి వనిత
- వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ స్థాయి సమావేశం

దేవరపల్లి: కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజలు గమనించి అవగాహన చేసుకుంటున్నారని రాష్ట్ర హోం శాఖ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. యర్నగూడెంలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ శ్రేణుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భవిష్యత్తులో ఈ రాష్ట్రానికి ఖచ్చితంగా జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఇందుకోసం మన మందరం ఇప్పటి నుంచి పార్టీ బలోపేతానికి కష్టపడి ఐక్యంగా పని చేయాలని ఆమె పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.కూటమి ప్రభుత్వం ఎన్ని దాడులు చేసినా, వేధిపులకు పాల్పడినా వైఎస్సార్ సీపీ శ్రేణులు ధైర్యంగా నిలబడి పార్టీ బలోపేతం కోసం పని చేస్తున్నాయని ఆమె అన్నారు.



పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తానేటి వనిత

ప్రతి కార్యకర్తకు వైఎస్ జగన్ అండగా ఉంటారని ఆమె భరోసా ఇచ్చారు.

27న విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా..

కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఈ నెల 27న గోపాలపురంలో నిర్వహించే ఆందోళనలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి వనిత కోరారు. ఉదయం 9 గంటలకు గోపాలపురంలోని పార్టీ కార్యాలయానికి పార్టీ శ్రేణులు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి వైఎస్సార్ జంక్షన్‌కు వెళ్లి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం విద్యుత్ ఏడీఏ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేస్తామని ఆమె వివరించారు. అలాగే కూటమి పాలనలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నల్లజర్లలో జనవరి 3న నిరసన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, పార్టీ మండల శాఖల అధ్యక్షులు కూచిపూడి సతీష్, గగ్గర శ్రీనివాస్, నాగరాజు, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణ, మండల యువజన విభాగం అధ్యక్షుడు అనిశెట్టి సూర్యచంద్రం, కుసులూరి వెంకటసతీష్, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరిశెట్టి రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్ గణిత మేధావి

నల్లజర్ల: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని దూబచర్ల డైట్ కళాశాలలో శనివారం ఛాత్రోపాధ్యాయులు నిర్వహించారు. కళాశాల ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. ముగ్గుల పోటీతో పాటు గణిత క్విజ్, బోధనోపకరణాల ప్రదర్శన ఏర్పాటుచేశారు. కార్యక్రమాలను ప్రిన్సిపాల్ కమలకుమారి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ భారతీయుల గణిత ప్రతిభాపాటవాలను ఛాత్రోపాధ్యాయులు తెలుసుకోవాలన్నారు. శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రానికి చేసిన సేవలను ఆమె వివరించారు. గణిత అధ్యాపకుడు సీహెచ్ లక్ష్మీనారాయణ, సీనియర్ అధ్యాపకులు ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, పీవీ రమణమూర్తి, వెంకటేశ్వరరావు, శామ్యూల్ సంజీవ్, దుర్గా ప్రసాద్, శ్రీరాంప్రసాద్, సూపరింటెండెంట్ పీవీ సుధాకర్ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఉండ్రాజవరం: గణిత మేధావి శ్రీనివాస రామనుజన్ జీవితం ఆదర్శనీయమని, ఆయన సిద్ధాంతాలను ఆచరిస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకొంటారని స్థానిక బౌద్ధ ధమ్మ పీఠాధిపతి బంతె అనాలియో అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహించారు.వారామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ సుంకవల్లి సూర్యనారాయణ హాజరయ్యారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు ఆళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.



దూబచర్లలో గణిత నమూనాలు ప్రదర్శిస్తున్న ఛాత్రోపాధ్యాయులు

రైతుల సంక్షేమం కోసమే సదస్సులు

పెరవలి: రైతు సంక్షేమం కోసం, నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వారు వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఆర్.వెంకట రమణ నాయక్ సూచించారు. మండలంలోని కానూరులో శనివారం సర్పంచ్ భావన పూర్ణ చందు మధు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై రైతుల నుంచి తొమ్మిది ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ డి.అచ్యుత కుమారి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ పావని, రైతులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు: పారా లీగల్ వలంటీర్లు (న్యాయ సేవా సహాయకులు)గా పని చేసేందుకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని నిడదవోలు పట్టణం, నిడదవోలు, చాగల్లు మండలాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు, లెక్చరర్స్, సీనియర్ సిటిజన్లు, సోషల్ వర్కర్లు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, న్యాయ విద్య అభ్యసించే విద్యార్థులు, ఎన్‌జీవోలు, రోటరీ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పారా వలంటీర్లుగా దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులని తెలిపారు.

స్కూల్ అసిస్టెంట్ కుటుంబానికి యూటీఎఫ్ ఆర్థిక సాయం

ఉండ్రాజవరం: గుండెపోటుతో ఇటీవలే మృతి చెందిన ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ వేంద్ర శ్రీనివాసరావు కుటుంబానికి యూటీఎఫ్ అండగా నిలిచింది. యూటీఎఫ్ జిల్లా కుటుంబ సంక్షేమ పథకం నుంచి రూ.3 లక్షల సంఘీభావ విరాళాన్ని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ విషయాన్ని ఉండ్రాజవరం హైస్కూల్ హెచ్ఎం కె.మాణిక్యాలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరంలో నిర్వహించిన సంతాపసభలో పలువురు శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణకుమారి, జిల్లా ప్రధానకార్యదర్శి ఎ.షరీఫ్, జిల్లా సహాధ్యక్షుడు ఐ.రాంబాబు, జిల్లా ఆడిట్ కన్వీనర్ సీహెచ్ శ్రీనివాసు, జిల్లా కార్యదర్శి వి.రమణ, మండలశాఖ అధ్యక్షుడు వైవీస్వామి, కార్యదర్శి బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.